రాఘవ కూర్చుని అతడు చేస్తున్న పనులనే నిర్లిప్తంగా చూస్తున్నాడు.

కేశవ్ తన చేతిలోని చిన్న తోలుసంచి నుంచి రాత్రి భట్టుగారు తన పెద్దల పేర్లు, వారి గోత్రాలు, బంధుత్వాలు రాసి ఇచ్చిన కాగితాన్ని, డబ్బు కట్టిన రసీదును బయటకు తీశాడు.

తర్పణాలు, పిండపూజ పూర్తయ్యేటప్పటికి పన్నెండు దాటింది. కేశవ్ పిండాలను తీసుకువెళ్లి ఎత్తునుండి నురుగులు కక్కుతూ పడుతున్న అలకనంద నీటిలో గతించిన పెద్దలను స్మరించుకుంటూ వదిలాడు. అతడి నేత్రాలు తండ్రి కోరికను ఇప్పటికైనా తీర్చగలిగాను అన్న తృప్తితో నిండి ఉన్నాయి.

కేశవ్ కళ్లలోని వెలుగును తదేకంగా చూస్తున్న రాఘవ తలెత్తితే..

పితరులే హిమాలయాల నుంచి వాటిని స్వీకరించేందుకు వస్తున్నారా!? అన్నట్లుగా ఆకాశాన వేగంగా కదులుతున్న తెల్లటి మబ్బు తునకలు.

అక్కడికి తమతోపాటు వచ్చిన భట్టుగారిని చూస్తూ,

''ఇక్కడ స్వచ్ఛమైన రుద్రాక్షలు దొరుకుతాయని విన్నాను. నాకు ఇప్పించగలరా?'' అడిగాడు రాఘవ.

''నా దగ్గరే ఉన్నయండీ! ఇస్తాను. చాలా పవిత్రమైనవి. సహజంగా చెట్లనుండి పొందినవి!''

''చాలా సంతోషం... వాటి ధర ఎంతో చెబితే ఇస్తాను!''

* * *

''ఈ పవిత్ర క్షేత్రంలో అడుగిడి మరణించిన ఆత్మీయులకు శాంతి చేకూరేలా నువ్వు ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించక పోవటం నాకు ఎంతో బాధ కలిగిస్తోంది రాఘవా!'' కేశవ్ గుండె లోతుల్లోనుంచి వచ్చిన మాటలు అవి.

ఉదయం ఆరుగంటల సమయంలో భట్టుగారు వాళ్లను బస్టాండులో దించి వెళ్లారు. అక్కడికి రాత్రి వచ్చిన బస్సు తిరిగి వెళ్లేందుకు రెడీగా ఉన్నది. అందులో కొందరు ప్రయాణికులు అప్పటికే ఎక్కి కూర్చున్నారు.

చలికి తట్టుకోవాలి అన్నట్లుగా స్వెటర్ తొడుక్కుని, మంకీ క్యాప్‌లు పెట్టుకున్నారు ఇద్దరూ.

''దేవుళ్లమీద నమ్మకం లేదా అంటే నమ్మలేను. నాతోపాటు దేవుళ్లందరినీ భక్తితో దర్శించుకున్నావు. పవిత్రమైన రుద్రాక్షలు కొని మెడలో వేసుకున్నావు. ఇన్నాళ్లూ ఏమయ్యాడో తెలియని మీ నాన్న మరణించాడని తెలిసినా.. తర్పణాలు విడవటానికి మాత్రం అంగీకరించలేక పోయావు!'' నిష్టూరంగా అన్నాడు కేశవ్.

రాఘవ మాట్లాడలేదు చాలాసేపు. మిత్రుడి మాటలు వింటూ ఇబ్బందిగా చూశాడు అతడి ముఖంలోకి. అంత చలిలోనూ ఎండిపోతున్న నోటిని తడుపుకొంటున్నట్లుగా.. నాలికను అటూఇటూ తిప్పాడు.

**అమాయకురాలైన ఓ ఆడపిల్లని ఏ వ్యక్తి అయినా కిరాతకంగా నాశనం చేసి.. ఆమె జీవితంలో వెలుగును అతిహేయంగా చిదిమి.. చీకటితో నింపివేయటం భరించగలిగే విషయమేనా? అలాంటి మనిషి చస్తే శాస్త్రాలు చెబుతున్నాయంటూ వారసులు మాసికాలూ, తద్దినాలతో అతడి ఆత్మకు ఆహారం పెట్టటం సమంజసమా? అతడికి సద్గతులు కలగాలని, స్వర్గానికి పంపాలని ప్రయత్నించటం సమంజసమా?**

''కేశవా! నువ్వు నాకెంతగానో నచ్చచెప్పాలని ప్రయత్నించావు. మనం బయల్దేరుతున్న సమయంలో అమ్మ కూడా నన్ను ఆ విధి నిర్వర్తించమంటూ కన్నీరు పెట్టుకోవటం నీకు గుర్తున్నది కదా! అయినా నాకు చేయాలనిపించలేదు! చేయలేదు!'' తలవంచుకుని అన్నాడు.

మళ్లీ..

''ఇంకా.. అయిపోయిన దాన్ని గురించి చర్చించటం అవసరమంటావా!'' అన్నాడు రాఘవ.

కేశవ్ మాట్లాడలేక పోయాడు.

తరువాత అరగంటలోనే బస్సు బయల్దేరింది.

పచ్చటి చెట్ల నడుమగా లోయలోకి జారిపోతున్నదా అన్నట్లుగా పోతున్న బస్సు. మంచుతో తడిసి అద్దాల సందులలోనుండి ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతూ వీస్తున్న చల్లటి గాలి.

''అమాయకురాలైన ఓ ఆడపిల్లని ఏ వ్యక్తి అయినా కిరాతకంగా నాశనం చేసి.. ఆమె జీవితంలో వెలుగును అతిహేయంగా చిదిమి.. చీకటితో నింపివేయటం భరించగలిగే విషయమేనా? అలాంటి మనిషి చస్తే శాస్త్రాలు చెబుతున్నాయంటూ వారసులు మాసికాలూ, తద్దినాలతో అతడి ఆత్మకు ఆహారం పెట్టటం సమంజసమా? అతడికి సద్గతులు కలగాలని, స్వర్గానికి పంపాలని ప్రయత్నించటం సమంజసమా?''.. పావుగంట తరువాత నోరు తెరిచాడు రాఘవ. మనసులోని నిజాల్ని ఇంకా అదిమి పెట్టుకోలేనట్లుగా.

విచిత్రంగా చూశాడు మిత్రుడి ముఖంలోకి కేశవ్.

''ఎవరతను?'' మనసులో రూపు ఏర్పరుచుకుంటున్న అనుమానం అతడిలో ఆరాటాన్ని పెంచసాగింది.

''రోజూ వచ్చే పనిమనిషి ఆరోగ్యం బాగోలేక.. పన్నెండేళ్ల కూతురుని పంపింది. ఇంట్లో అతడు తప్ప ఎవరూ లేరు. తెలిసీ తెలియని వయసులో ఉన్న ఆ అమ్మాయిని అదునుచూసి కాటేశాడు అతడు. అందునా ఆ పిల్ల ఎవరికీ బాధను చెప్పుకోలేని మూగది. ఇంటికి పరుగెత్తుకెళ్లి ఏడుస్తూ తల్లికి సైగలతో చెబితే ఆమె అర్థం చేసుకుని.. తన వాళ్లందరినీ తీసుకుని, కర్రలూ కత్తులతో ఇంటిమీద దాడి చేస్తే.. అతడు భయంతో పారిపోగా ఆ కొంప ఛిన్నాభిన్నమైంది. ఆ ఇంట్లో మిగిలినవారి మనసులు అవమానంతో చచ్చి శవాలయ్యాయి. పదిహేను సంవత్సరాల క్రితం ఆ నికృష్టపు పనిచేసిన అతడికి మనం ఇక్కడ ఇప్పుడు మనవాడు అనే ఒక్క కారణంతో స్వర్గద్వారాలు తెరిపించాలా?''

''ఎవరతను?''..

తన అనుమానం నిజం కాకూడదని దేవుడిని ప్రార్థిస్తూ అడిగాడు భయం భయంగా కేశవ్.

''నేను నాస్తికుడిని కాదని నీకు తెలుసు. నీ మాట, అమ్మ మాట వినకపోవటానికి అసలు కారణమేమిటో ఊహించలేక తపన పడుతున్నావనీ తెలుసు. పదిహేను సంవత్సరాలుగా నిజాన్ని మింగలేక, కక్కలేక నాలో నేనే కుమిలిపోవటానికి అలవాటుపడ్డ నన్ను.. మా బంధువు నుండి వచ్చిన ఉత్తరం మరింత కుంగదీస్తూ, అడకత్తెరలో పెట్టి నొక్కసాగింది. నీ ముందు ఇంకెన్నాళ్లీ దాగుడుమూతలు!'' చటుక్కున ముఖాన్ని రెండు చేతులలో దాచుకున్నాడు.

అయ్యో.. తెరుచుకున్న మిత్రుడి మనసును చూడలేనట్లుగా తలవంచుకున్నాడు కేశవ్.

''గరుడపురాణంలో చెప్పినదంతా నిజమే అయితే అతడు నరకానికి వెళ్లి అక్కడ ఆ శిక్షలన్నీ అనుభవించకతప్పదు!'' అతడి కళ్లు కోపంతో నెత్తుటి ముద్దలు అవుతున్నాయి.

''ఆ అమ్మాయి బతుకేకాదు.. మా జీవితాలూ ముక్కలయ్యాయి. తెలిసినవారి దృష్టిలో హీనచరితులమయ్యాం. వారి చీదరింపులకు గురయ్యాం. బతకటానికి అమ్మ అడ్డమైన చాకిరీ చేసింది. వడియాలు పెట్టింది, అప్పడాలు ఒత్తింది, కూరలు వండింది.. వాటిని నేను సంచుల్లో పెట్టుకుని ఇంటింటికీ తిరిగి అమ్మాను. మొదట్లో కొన్ని ఇళ్లల్లో వాకిళ్లు ఊడ్చి, అంట్లు తోమింది కూడా! వాళ్లు ఇచ్చిన చద్ది పదార్థాలను తెచ్చుకుని నాకు పెట్టి.. మిగిలింది తను తిన్నది. ఈ స్థితికి కారణం నాన్న అని గర్వంగా చెప్పుకోవాల్సిన ఆ మగవాడు కాదా.. నరకంలో అన్ని విధాలా శిక్షలు అనుభవించటానికి అర్హుడైన అతడిని నేనెందుకు కాపాడాలి? ఎందుకు రక్షించాలి?'' ఆవేశంతో ఊగిపోతున్నాడు రాఘవ.

అతడి చేతిమీద చేయి వేశాడు కేశవ్ అనునయిస్తున్నట్లుగా. మరుక్షణంలోనే అతడి మనసులో భారతంలోని ఓ పద్యం మెదిలింది.

**తనువున విరిగిన యలుగుల**
**ననువున బుచ్చంగవచ్చు నతినిష్ఠురతన్**
**మనమున నాటిన మాటలు**
**విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా?**

మిత్రుడి ముఖంలోకే స్తబ్ధుగా చూస్తూ ఉండిపోయాడు కేశవ్.

శరీరానికి తగిలిన గాయాలకు చికిత్స చేసుకుని ఆ మనిషి విముక్తి పొంది ఉండవచ్చు కానీ.. జీవించి ఉన్న ఈ మనిషి తన మనసుకు కలిగిన గాయంనుండి ఎప్పటికి కోలుకోగలిగేనో.. ■

## పి.ఎస్. నారాయణ



మానసిక విశ్లేషణతో కూడిన రచనలు చేయడంలో రచయిత పి.ఎస్. నారాయణ దిట్ట. అలాంటి రచనే.. 'మనసా ఎటులోర్తునే'. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చినకాకాని. 30 ఏళ్లపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐడీపీఎల్‌లో వివిధ స్థాయుల్లో ఉద్యోగం చేశారు. 1993లో సీనియర్ ఎకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌గా స్వచ్ఛంద విరమణ చేశారు. 28 ఏళ్ల క్రితం రచనా వ్యాసంగం మొదలుపెట్టారు. ఇప్పటివరకూ 350కి పైగా కథలు, 50 నవలలు రాశారు. వీటిలో మానసిక విశ్లేషణతోపాటు సస్పెన్స్‌తో కూడిన ధారావాహికలూ ఎన్నో ఉన్నాయి. వీటిలో పలు కథలు కన్నడ, తమిళ భాషలలోకి అనువాదమయ్యాయి. వివిధ సాహితీ సంస్థలు, పత్రికలు నిర్వహించిన పోటీల్లో.. ఈయన రాసిన కథలు, నవలలు.. బహుమతులు గెలుపొందాయి. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించిన కథల పోటీ 2023–24లో 'మనసా ఎటులోర్తునే..' రూ.3వేల బహుమతికి ఎంపికైంది.